క్లుప్తంగా

నేడు సాలీపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను శుక్రవారం సాలీపేట టెలిఫోన్ ఎక్సైంజ్ రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ క్యాంప్ కొనసాగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం



తెనాలిటౌన్: పట్టణ యడ్లలింగయ్య కాలనీకి చెందిన పోలపతి సాయిరోజాకు మూడోవ కాన్పుకు పురిటి నొప్పులు రావడంతో గురువారం స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఇంతలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే సాయిరోజా ప్రసవించింది. ఈఎంటీ గొరికపూడి ఆనంద్ కాన్పు నిర్వహించి, ప్రథమ చికిత్స అందించారు. తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారని ఆనంద్ తెలిపారు. వీరిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు అంబులెన్స్ పైలెట్ పూల శ్రీనివాసరావు తరలించారు.

26న ఉచిత వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: రెయిన్ బో ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో ఈ నెల 26న ఉచిత మెగా మెడికల్ క్యాంప్(క్యాన్సర్ స్కీనింగ్)ను నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ జీవనలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం రోడ్డులోని డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్యాంపు జరుగుతుందన్నారు. గర్భాశయ ముఖద్వారా, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ, డయాబెటిస్, స్క్రీనింగ్ టెస్ట్, హెచ్‌బీ, ఏ.సీ., థైరాయిండ్ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. తెనాలి పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ద్విచక్రవాహనాల చోరీ

చేబ్రోలు: మండలంలో ఒకే రోజు రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. నారాకోడూరుకు చెందిన గొట్టేటి గంగాధరరావు గార్మెంట్ షాపును నిర్వహిస్తున్నాడు. 17వ తేదీ సాయంత్రం షాపులో పని చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పాత యమహా బైక్‌ను ముందు ఉంచాడు. అనంతరం రూ.లక్ష విలువ చేసే కొత్త బైక్‌ను అపహరించుకుపోయాడు. వాహనం తీసుకుని వెళ్లే సమయంలో గమనించి పట్టుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీనిపై గంగాధరరావు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంచాల గ్రామానికి చెందిన అన్నదాసు గంగాధరరావు ఎప్పటిలాగానే ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు బుధవారం రాత్రి ఉంచాడు. గురువారం తెల్లవారుజామున చూసే సరికి మాయమైంది. పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల కిందట వడ్లమూడిలోనూ మోపెడ్ దొంగతనానికి గురైనట్లు తెలిసింది.

భార్యపై దాడి చేసిన భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యపై దాడి చేసిన భర్తపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాడీపేటలోని ఓ అపార్టుమెంట్ వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న భర్త దేవీలాల్ నాయక్‌తో కెతావత్ కల్యాణి విభేదించి రెండు సంవత్సరాల కిందట విడిపోయింది. ఈనెల 13న దేవీలాల్ నాయక్ భార్య వద్దకు వచ్చి గొడవ పడి, కొట్టి దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కొరిటిపాడుకు చెందిన కె.సునీల్‌కుమార్ ఈనెల 11న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేతాజీనగర్‌లో మహిళ..

మహిళ అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నేతాజీనగర్‌కు చెందిన ఓ మహిళ ఈనెల 18వ తేదీ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు



శ్రీ విద్యాపీఠంలో డ్రై ఫ్రూట్స్‌తో అలంకరణ



వారాహిదేవిగా బాలత్రిపుర సుందరీదేవి



అష్టభుజ దుర్గాదేవి ఆలయంలో చండీకాదేవి

తెనాలిటౌన్: దసరా దేవి శరన్నవ రాత్రులు పట్టణ, రూరల్ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఆలయాల్లో గురువారం భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. మారీసుపేట శివాలయంలో వారాహిమాతకి విశేష పూజలు జరిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక పూజలు జరిపారు. బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ధనలక్ష్మి అలంకరణ చేశారు. రూ.65 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆలయంలోని గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. మారీసుపేట శివాలయంలో బాలత్రిపుర సుందరీదేవికి వారాహిదేవి అలంకరణ చేశారు. అష్టభుజి దుర్గాదేవి ఆలయంలో, చండీకాదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

■ దేవిచౌక్‌లోని రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గంగానమ్మ పేటలోని శ్రీ విద్యాపీఠంలో అమ్మవారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. పూజ్యశ్రీ బాల స్వామిజీ ప్రత్యేక పూజలు జరిపారు. ప్రసాద వితరణ జరిపారు. సాలీగ్రామ మఠం సభ్యులు ఎం.రమణయ్య, వుప్పల నాగేశ్వరరావు, లలితా సేవా సమితీ, శ్రీ విద్యాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

■ డాంగేవారవీధిలో కనకదుర్గా విగ్రహం వద్ద హోమం నిర్వహించారు. హోమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని పూజలు జరిపారు. ఐతా నగర్‌లో కనకదుర్గా సేవా సమితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేంద్రప్రసాద్, నన్నపనేని సుధాకర్, తాడిబోయిన హరిప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

■ రూరల్ మండలం కొలెవరంలోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మహాకాళిగా భక్తులకు దర్శనమిచ్చారు. నంది వెలుగులోని కనకదుర్గా ఆలయంలో సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి తమ్మా శివారెడ్డి, అగస్తేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ తన్నీరు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



రాజరాజేశ్వరి దేవి ఆలయంలో గాయత్రీదేవి



కొలెవరం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో మహంకాళి

అందరికి మెరుగైన ఆరోగ్యం.. జగనన్న సురక్ష లక్ష్యం



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ హరిప్రసాద్



బీపీ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ హరిప్రసాద్

తెనాలిఅర్బన్: రాష్ట్రంలోని ప్రజలందరికి మంచి ఆరోగ్యాన్ని అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ అన్నారు. సాలీపేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. మెడికల్ క్యాంప్‌ను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలకు కూడా మెరుగైన వైద్యాన్ని ఉచితంగా ఇక్కడ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. జగనన్న సురక్ష మెడికల్ క్యాంప్‌లో జనరల్ 77, డెర్మాటాలజీ 52, ఫిజిషియన్ 38, ఆప్తామాలజీ 87 మంది వైద్య సేవలు పొందినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళిదాసు వెంకట సత్యం, కోలా వాసు, అల్లూరి శ్రీను, వైద్యాధికారులు డాక్టర్ డి.కిషోర్‌కుమార్, డాక్టర్ ఉషారాణి, పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్ర రావు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నా ఫొటోతో స్టాంప్ ఆవిష్కరణ



మంగగిరి: పోస్టాఫీసులో నూతనంగా నా స్టాంప్‌తో ఫొటో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. ప్రస్తుత ఆధునిక యుగంలో ఉత్తరాలు, పోస్టాఫీసులను గత జ్ఞాపికలుగా మిగిలే పరిస్థితులలో నా ఫొటోతో స్టాంప్ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మరలా పోస్టాఫీసులు ప్రజలకు దగ్గర అయ్యే అవకాశముందన్నారు. గురువారం ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నా ఫొటోతో స్టాంప్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోస్టుఫీసు కార్యాలయ అధికారులు బి శ్రీనివాసరావు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి ఏటీపీఎం హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు రూ.5లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. కార్నర్ స్టోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఫాదర్ మన్నం సుధాకర్ ఆధ్వర్యంలో 82 మంది ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తి విద్యాకోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.5లక్షల ఉపకార వేతనాలను గురువారం పంపిణీ చేశారు. ఉపకారవేతనాలు అందజేసిన ఫాదర్ మన్నం సుధాకర్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మురళీ, హృదయరాజు, ఉపాధ్యాయులు బాలకిషోర్, జాకోబ్, నాగరాజు, శ్రీను, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

మంగళగిరి: నకిలీ పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి దుకాణాలను సీజ్ చేస్తామని వ్యవసాయ శాఖ మంగళగిరి ఏడీఏ జి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి నాణ్యతపై అనుమానం ఉన్న మందుల శాంపిల్స్‌ను సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపడం జరిగిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 13 రకాల పురుగుమందుల శాంపిల్స్‌ను సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపామన్నారు. పరీక్షా కేంద్రాల ఫలితాలలో నాణ్యత లోపిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



నగరంపాలెం: తెలంగాణ మద్యం సీసాలు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సెబ్ గుంటూరు ఎస్ఈబీ -1 స్టేషన్ సీఐ ఎం.రమేష్ తెలిపారు. బ్రాడీపేటలోని స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు ఎస్ఈబీ -1, ఆర్పీఎఫ్ సంయుక్తంగా గురువారం ఉదయం గుంటూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద అమరావతి రోడ్డు టెలికంనగర్‌కు చెందిన పి.రామమోహనరావును, సంపత్‌నగర్‌లోని పార్వతీపురం రెండో వీధికి చెందిన కె.సురేంద్రను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు చెప్పారు.ఈ క్రమంలో వారి నుంచి తెలంగాణకు చెందిన 83 మద్యం సీసాలను గుర్తించి, అరెస్టు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు. గుంటూరు నుంచి రైలు మార్గం ద్వారా తెలంగాణలోని నల్గొండ నుంచి సీసాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాంశాలు



నృత్యాంశాలను ప్రదర్శించిన చిన్నారులతో అతిథులు



కూచిపూడి నృత్య కళా కేంద్రం చిన్నారులు

తెనాలి: దసరా పర్వదినం సందర్భంగా పట్టణంలో దేవీ శరన్నవరాత్రుల్లో ఆధ్యాత్మిక ఆనందం వెల్లివిరుస్తోంది. వివిధ దేవాలయాల్లో అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఆహ్లాదకరంగా ఉంటున్నాయి. స్థానిక శివాజీ చౌక్‌లో దేవస్థానం కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉత్సవాల్లో శ్రీ కల్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ నృత్య గురువు డాక్టర్ చల్లా బాల త్రిపుర సుందరి శిష్య బృందం బుధవారం రాత్రి వివిధ కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. పట్టణానికి చెందిన న్యాయవాది కాకుమాను కనక రాంబాబు, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నృత్య గురువు డాక్టర్ చల్లా బాల త్రిపుర సుందరిని సత్కరించి, శిష్య బృందానికి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో యర్రా శ్రీనివాసరావు, కందేపి సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తెనాలిటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలోని వేదికపై కూచిపూడి నృత్య కళా కేంద్రం నిర్వాహకులు నాట్యచారిణి వెంకటలక్ష్మి శిష్య బృందం చేసిన నృత్యాలు విశేషంగా ఆలరించాయి. శ్రీ శారద నమోస్తుతే అంటూ చిన్నారులు చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేవి చౌక్‌లోని రాజరాజేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన సాంస్కృతి వేడుకల్లో పొట్లూరి వెంకట ఆదిలక్ష్మి సంకీర్తన గాన బృందం సభ్యులచే భక్తిరంజని కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాంస్కృతి కార్యక్రమాలను తిలకించారు.

సంతాన లేమి సమస్యలకు ఉచిత వైద్య శిబిరం

డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు మెడికల్: సంతాన లేమి సమస్యతో బాధపడుతున్న వారికి తమ ఆసుపత్రిలో నవంబరు 12 వరకు ఉచితంగా కన్సల్టేషన్, అల్ట్రాసౌండ్ పరీక్షలు, కౌన్సెలింగ్, ఉచిత స్పెర్మ్ పరీక్షలు చేస్తున్నామని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణుడు, అహల్య ఐవీఎఫ్ సెంటర్ అధినేత డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు కొత్తపేట శివాలయం వెనుక ఉన్న అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో, విజయవాడ సీతారామపురం వారణాసి వీధిలోని అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో నెల రోజుల పాటు మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంతానం లేని దంపతులతో పాటు ప్రమాదవశాత్తు సంతానం కోల్పోయినవారు కూడా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఉచిత వైద్య శిబిరాలకు వచ్చే వారికి 50 శాతం రాయితీతో ఐవీఎఫ్ చికిత్సలు అందిస్తున్నామని స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల రాజకుమారి తెలిపారు. పూర్తి వివరాల కోసం 9848590244, 9908836169 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

ఎస్ఐ తీరును నిరసిస్తూ ఆందోళన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న బాధితులు

తాడికొండ: హోమ్‌గార్డు ఇంటికి అడ్డొచ్చిందంటూ ఎస్ఐ వచ్చి దగ్గరుండి వైర్లు తొలగించాడు. ఎస్ఐ తీరును నిరసిస్తూ తాడికొండ జెండా చెట్టు వద్ద ప్రధాన రహదారిపై బాధితులు బైఠాయించారు. స్థానిక జెండాచెట్టు బజారులో నివాసం ఉంటున్న మహిళా హోమ్‌గార్డు ఇంటి వద్ద ఎదురు సందులో నుంచి పలువురు వినియోగదారులు విద్యుత్ తీగెలు పోల్‌కు వేసుకున్నారు. అయితే తమ ఇంటికి ఆనుకొని వెళుతున్నాయంటూ ఆమె ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నాగార్జున ప్రైవేటు విద్యుత్ సిబ్బందితో సర్వీస్‌లను తొలగించి తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ఇనుప పోల్‌ను పడేశారు. ఆగ్రహించిన బాధితులు తాము గత 40 సంవత్సరాలుగా విద్యుత్‌ను వినియోగిస్తున్నా ఎలాంటి ఇబ్బంది లేదని, హోమ్‌గార్డు ఇల్లు నిర్మాణం చేసినప్పటి నుంచే సమస్య వచ్చిందని కావాలనే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ సముదాయించేందుకు ప్రయత్నించగా ససేమిరా అన్నారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని మా సర్వీస్‌లను ఎలా తొలగిస్తారు, హోమ్‌గార్డు ఇంటి నిర్మాణం చేసిన స్థలం సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకొచ్చి పరిశీలిస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. హైకోర్టు జడ్జిలు రోడ్డు మార్గంలో వచ్చే సమయం కనుక ఆందోళన విరమించాలని నచ్చజెప్పి స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. ఇరువర్గాలను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం ఎలా తీసుకుంటారని నిలదీయడంతో తప్పని సరి పరిస్థితుల్లో విద్యుత్ అధికారులను సంప్రదించి తిరిగి విద్యుత్ కనెక్షన్‌లు ఇప్పించారు.

కోడి పందేలపై దాడులు

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు తాడికొండ మండలం కంతేరుల మధ్య పొలాల్లో జరుగుతున్న కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోడిపందేలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి 11 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.27,500 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

న్యూయార్క్ సొల్యూషన్స్‌తో చలపతి ఫార్మసీ కళాశాల ఎంఓయూ



గుంటూరు రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాల్ని పెంపొందిస్తూ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్ని రూపొందించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా న్యూయార్క్ సొల్యూషన్స్ 3 ఎక్స్ పని చేస్తోందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సొల్యూషన్ 3ఎక్స్ సంస్థతో ఒప్పందం ద్వారా కళాశాలలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మెడికల్ కోడింగ్ వృత్తికి ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. కార్పొరేట్ హాస్పిటల్స్, ఇన్స్యూరెన్స్ కంపెనీలు, ల్యాబ్స్, ఫార్మా కంపెనీల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం సొల్యూషన్స్ 3 ఎక్స్ సంస్థ ప్రతినిధి సమీవుల్లా మహమ్మద్‌తో ఒప్పంద పత్రాల్ని మార్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ లాక్కెళ్లిన దుండగులు

మంగళగిరి: ద్విచక్రవాహనంపై వెళుతుండగా చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని దుండగులు పరారైన ఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... తన కుమారుడితో ద్విచక్రవాహనంపై వెళుతుండగా స్పీడ్ బ్రేకర్ రావడంతో వాహనం స్లో చేశారు. వాహనంపై ఉన్న కుమారుడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ని వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కుని పరారయ్యారు. వాహనం వెంట పడ్డా దుండగులు దొరక్కపోవడంతో స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డేటా చౌర్యంపై అప్రమత్తత అవసరం



గుంటూరు రూరల్: డేటా చౌర్యంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లైప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో జి. భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చౌడవరంలోని కళ్లం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోరాదని సూచించారు. ఫోన్లలో ఓటీపీతో పాటు పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పేలను అప్‌డేట్ చేసుకునేటప్పుడు వచ్చే మెసేజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఫోన్ నంబర్‌కు అనుసంధానమైన బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఏవో కె. నవ్య, డాక్టర్ రాజీవ్‌జట్లన్ పాల్గొన్నారు.

చెరువులో ఈతకు వెళ్లి యువకుడి మృతి



పొన్నూరు: చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన స్నేహితులైన నలుగురు యువకులు మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలోని చెరువులో బుధవారం సాయంత్రం ఈతకు వెళ్లారు. చెరువు మధ్య భాగానికి వెళ్లిన గట్టు చిరంజీవి (22) ఈతరాని కారణంగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. మిగిలిన ముగ్గురు యువకులు ఒడ్డుకు చేరుకొని గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. సంఘటన సమాచారం తెలుసుకున్న పొన్నూరు రూరల్ పోలీసులు గురువారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతదేహం లభ్యం కాగా, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న చిరంజీవి మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.